ప్రతీ ఇంటిపై తిరంగాను రెపరెపలాడించాలి

● హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపు

ఎల్‌బీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకుంటూ ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండాలు రెపరెపలాడించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బీజేపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మహిళామోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కొత్తపేట చౌరస్తా సమీపంలోని ఓమ్ని ఆస్పత్రి వద్ద సామ రంగారెడ్డి ప్రారంభించారు. ఓమ్ని ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ కొత్తపేట, నాగోల్ మీదుగా మన్సూరాబాద్ సహారా వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివర్ణ పతాకం గొప్పదనాన్ని ఇనుమడింపజేయడానికి హర్ ఘర్ తిరంగా అభియాన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తేదీన దేశ విభజన సమయంలో అనేక మంది హిందువులు ఊచకోతకు గురైన సందర్భాన్ని స్మరించుకుంటూ అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ స్మారక దినం పాటించనున్నట్లు ఆయన తెలిపారు. 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడేలా బీజేపీ కార్యకర్తలు సమష్టిగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి బూత్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేలా బూత్ కమిటీ అధ్యక్షులు బాధ్యతగా నిర్వహించనున్నట్లు రంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్, కలంశెట్టి లయ, నూకల పద్మారెడ్డి, కసిరెడ్డి పద్మారెడ్డి, పోరెడ్డి కవిత, చల్ల గీతారెడ్డి, కట్టా విజయ, మంగారెడ్డి పాల్గొన్నారు.


హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న సామ రంగారెడ్డి

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సైదాబాద్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవంతో భాగంగా మలక్‌పేట నియోజకవర్గం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని గడ్డిఅన్నారం రెడ్‌క్రాస్ వద్ద బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ మలక్‌పేట, మూసారాంబాగ్, చంచల్‌గూడ, సైదాబాద్‌ల మీదుగా కొనసాగింది. వందలాది మంది బీజేవైఎం నేతలు జాతీయ జెండాను పట్టుకుని బైక్ ర్యాలీకి హాజరయ్యారు. ప్రతి ఇంట్లో జాతీయజెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి రాజేష్, ఆశీష్, దినేష్, వినోద్ పాల్గొన్నారు.


పెట్టుబడి వేడుక కార్యక్రమంలో ఏసీపీ కృష్ణయ్య

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

● ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

వనస్థలిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఎంచుకున్న రంగంలో రాణించాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. మన్సూరాబాద్‌లోని కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో పెట్టుబడి వేడుక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మాదిరిగా విద్యార్థులు కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి రమేష్‌చంద్ర, డైరెక్టర్ రవిప్రసాద్, రాధ, ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

చంపాపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం సరూర్‌నగర్ మండల విద్యాధికారి బాసునాయక్ తనిఖీ చేశారు. తరగతి గదుల్లో కొనసాగుతున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు అజిత, రజిత, జ్యోతి, రజిత, వినయ్‌కుమార్, కావ్య పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ బాసునాయక్

సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

చంపాపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చంపాపేట డివిజన్ నిర్మలానగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నూతనంగా వేస్తున్న రహదారి నిర్మాణ పనులకు కాలనీవాసులు సహకరించాలని కోరారు. ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులు, మెట్లను తొలగించి వాల్ టూ వాల్‌గా సీసీని నిర్మించాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జగన్‌గుప్తా, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రాంరెడ్డి, జంగయ్య, పాండురంగారెడ్డి, కేశవర్ధన్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి


కేరళ వరద బాధితులకు నిధి సేకరణ చేపడుతున్న సీఐటీయూ నాయకులు

వరద బాధితులను ఆదుకుందాం

వనస్థలిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకుందాం.. వారికి అండగా ఉందామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం ఆటోనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులకు సహాయార్థం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జరిగిన అతివృష్టితో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సేకరించిన 11,150 రూపాయలను సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు నర్సింహ, లింగస్వామి, రాఘవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రోషన్‌దౌలా బస్తీలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్‌మాదిగ, సుధాకర్‌మాదిగ

మాదిగల విజయోత్సవాలను జయప్రదం చేయండి

చంపాపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో మంగళవారం నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సంబరాలలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్నేపల్లి అశోక్‌మాదిగ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా బస్తీలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీకి ముఖ్య అతిథిగా అశోక్‌మాదిగ హాజరై మాట్లాడుతూ 30సంవత్సరాలుగా తెలుగు నేలపై జాతి భవిష్యత్ కోసం జరిగిన పోరాటం ఫలించిందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సుధాకర్‌మాదిగ, బస్తీవాసులు మౌలాలిమాదిగ, రాజు, అడువయ్య, రంగయ్య, శేఖర్, నాగ పాల్గొన్నారు.

విజయ దండోరాను విజయవంతం చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న ఉద్యమ నేత మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకాలని మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శనం జంగయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే విజయ దండోరాను విజయవంతం చేయాలన్నారు. 30ఏళ్లుగా దండోరా ఉద్యమం నిర్వహించి మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను కృష్ణ మాదిగ సాధించారన్నారు. మాదిగ జర్నలిస్టులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

క్రిడాలో 13,14 తేదీల్లో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్‌లపై సమావేశం

సంతోష్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఆర్-క్రిడా)లో ఈనెల 13,14 తేదీల్లో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులపై రెండురోజుల సమీక్షా సమావేశం ఉంటుందని ఐసీఆర్-క్రిడా డైరెక్టర్ వీ.కె.సింగ్ తెలిపారు. క్లైమెట్ స్మార్ట్ వ్యవసాయం, రియల్‌టైమ్ కరువు, పర్యవేక్షణ, నిర్వహణ, నీటి ఉత్పాదకతను పెంపొందించడం, పంటల వేగవంతమైన పెంపకం, వరదభీమా ఉత్పత్తుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివిధ అంతర్జాతీయ ఏజెన్సీల నిధులతో దాదాపు 29 ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. న్యూఢిల్లీ ఐసీఆర్(ఎన్‌ఆర్‌ఎం)డీడీజీ డాక్టర్ ఎస్.కె.చౌదరి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో దేశం నుంచి సుమారు 30మంది పాల్గొని ప్రాజెక్టుల పురోగతిని ప్రదర్శిస్తారన్నారు. సమావేశం తర్వాత ఐసీఆర్-క్రిడా స్టేట్ ఆఫ్ అర్ట్ క్లైమెట్ రిసెర్చ్ ఫెసిలిటీస్, కేవీకే హయత్‌నగర్ పరిశోధన క్షేత్రంలో టెక్నాలజీ పార్క్, రెయిన్‌ఫెడ్ హార్టికల్చరల్ సిస్టమ్స్, కన్జర్వేషన్ అగ్రికల్చర్ సిస్టమ్స్, ఆగ్రోఫారెస్ట్రీ వంటి క్షేత్ర ప్రయోగశాలను సందర్శిస్తారన్నారు.

ఫలహారం బండి ఊరేగింపు

ఎల్‌బీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో భాగంగా లింగోజిగూడ, సరూర్‌నగర్, ఆర్‌కేపురం ప్రాంతాలలో ఫలహారం బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. లింగోజిగూడలో జ్యోతిక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్ర బోయిన శ్రీనివాస్‌రావు, బీజేపీ కుమ్మర సెల్ కోకన్వీనర్ మల్కాజిగిరి కుమార్, బీజేవైఎం నాయకుడు సిల్వేరి అనీల్‌కుమార్ పాల్గొన్నారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన ఫలహారం బండ్ల ఊరేగింపులో మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌కేపురంలో జరిగిన ఊరేగింపులో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గణేష్, మధుసూదన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.


ఫలహారం బండి ఊరేగింపులో ఎంపీ ఈటల రాజేందర్

పోచమ్మ ఆలయంలో ఎంపీ పూజలు

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీని ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

హయత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి ఎగుర వేసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వంశీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే ఈ సంఘం ఆవిర్భవించి దేశం కోసం పోరాటం చేసిందన్నారు. లక్నో మహానగరంలో 1936లో ఏర్పడిన తొలి సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు పోరాటం చేశారని గుర్తు చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మాతృభూమి విముక్తి కోసం అనేక మంది యువకులు పోరాటం చేశారని అన్నారు. సంఘం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో ప్రభుత్వ మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బన్నీ, భాను, ఉపేందర్, గణేష్, వరుణ్, లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాలను పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆర్ఎర్ఆర్‌కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత భూమి విముక్తి కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. 89 ఏళ్లుగా గల్లి నుంచి ఢిల్లీ వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు. పోరాటాలతో వందల విజయాలను సాధించిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా వినోద్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రధాన కార్యదర్శి చింత వెంకటేష్, కార్తీక్‌రెడ్డి, జోష్న, భాను, భానుప్రకాష్, నరేష్, నవీన్, జాహ్నవీ, జ్యోతి పాల్గొన్నారు.


ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి

హిందువులపై దాడులను నిరసిస్తూ ర్యాలీ

హయత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం హయత్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. హిందు ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో ర్యాలీ హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం నుంచి జాతీయ రహదారిపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన ఆందోళనలను పక్కదారి పట్టించి హిందువులనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దారుణమని అన్నారు. అతి క్రూరంగా హిందువులను హతమార్చడం, అత్యాచారాలు చేయడం, దేవాలయాలను ధ్వంసం చేయడం, ఇళ్లను కూల్చివేయడం లాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారని అన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, పులుసాని జీవన్‌రెడ్డి, అనుప్‌రెడ్డి, చెన్నమోని కృష్ణ, వీరేష్ గుప్తా, సత్యం, గుడాల లక్ష్మయ్య, బాలు, ప్రభాకర్‌రెడ్డి, వస్పరి వెంకటేశ్, గోవిందాచారి, మల్లేష్‌యాదవ్, వేణుగౌడ్ పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న హిందు ధర్మ రక్ష సమితి నాయకులు


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఇన్‌స్పెక్టర్

చంపాపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కోరారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం పీస్ కమిటీ సభ్యులతో ఇన్‌స్పెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితితో పాటు ముస్లింలు నిర్వహించుకొనే వివిధ పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఎస్ఐ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఓబీసీ విభాగం కన్వీనర్‌గా పృథ్వీరాజ్

చాదర్‌ఘాట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్‌గా బొడ్డుపల్లి పృథ్వీరాజ్‌ను నియమిస్తూ ఓబీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓబీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కమిటీలో సమర్థవంతంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ఠంగా చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పృథ్వీరాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


బొడ్డుపల్లి పృథ్వీరాజ్

ప్రభుత్వ భూమిని రక్షించండి

● ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు బీజేపీ అధ్యక్షుడు విష్ణు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు బండి గారి విష్ణుగౌడ్ సోమవారం రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌కు ఫిర్యాదు చేశారు. బాటసింగారం సర్వే నంబర్ 376 పార్ట్‌లో పట్టా భూములతో పాటు 36ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములు ఉన్నాయని తెలిపారు. కొందరు రియల్ వ్యాపారులు పట్టా భూముల సాకుతో ప్రభుత్వ సీలింగ్ భూములను ఆక్రమించారని తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో కుమ్మక్కై సదరు స్థలాల్లో కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని పేర్కొన్నారు. పలుమార్లు ఇరు శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రస్తుతం ఆ భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని వెంటనే సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయించాలని కోరారు. అదేవిధంగా సదరు భూమిలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కబ్జాకు, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విష్ణుగౌడ్

10 తులాల బంగారు నగల చోరీ

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మాయమాటలతో హోటల్ రూమ్‌లో వ్యక్తిని ఏ మార్చి అతని వద్ద ఒక మహిళ 10 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు, కావలికి చెందిన షేక్ విజయసాగర్ వ్యాపారి. ఈనెల 5న హైదరాబాద్‌కు షాపింగ్ కోసం వచ్చాడు. రాక్‌టౌన్‌లో అతడి సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. సోదరుడికి పరిచయం ఉన్న శ్రీలక్ష్మీ అనే మహిళ అతనికి ఫోన్‌చేసి ఎక్కడైనా పర్సనల్‌గా కలుద్దామని చెప్పింది.. దీంతో అతడు ఈనెల-9న ఎల్బీనగర్‌లో గల విరాట్ గ్రాండ్ హోటల్‌లో రూమ్ బుక్ చేసి ఆమెకు సమాచారం ఇచ్చాడు. ఇద్దరూ ఆ హోటల్‌కు వెళ్లారు. విజయ్‌సాగర్ స్నానం చేసి, ఫ్రెష్ కావాలని చేతికి ఉన్న బంగారు కడియం, గొలుసులు తదితర ఆభరణాలు(10 తులాలు) తీసి టేబుల్ పై పెట్టి వాష్ రూమ్‌కు వెళ్లాడు. 20 నిమిషాల తర్వాత బయటకు వచ్చి చూస్తే గదిలో ఉన్న మహిళ బంగారు ఆభరణాలతో ఉడాయించింది. వెంటనే అతడు ఆమెకు ఫోన్ చేస్తే ఆభరణాలు తన వద్దే ఉన్నాయని మరుసటి రోజు తెచ్చి ఇస్తానని నమ్మించింది. ఆ తర్వాత అతడి నెంబర్‌ను బ్లాక్ చేసింది. దాంతో బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మొరాయించిన ఆర్టీసీ సిటీ బస్సు.. ట్రాఫిక్ జామ్

చాదర్‌ఘాట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హయత్‌నగర్-2 డిపోకు చెందిన సిటీ బస్సు మెహదీపట్నం నుంచి ఎన్జీవోస్ కాలనీకి వయా మలక్‌పేట నల్లొండ చౌరస్తాలోని టాప్ఇన్ టౌన్ హోటల్ ముందు నుంచి సోమవారం ఉదయం వెళ్తుండగా మొరాయించింది. ఇరుకు రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి దాదాపు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకుని బస్సును పక్కకు తప్పించడంతో ట్రాఫిక్ సమస్య కొం తవరకు తగ్గింది. ఇటీవల ఆర్టీసీ సిటీ బస్సులు సాంకేతిక సమస్యలతో రోడ్లపై మొరాయించడం మామూలైపోయింది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయనడానికి తాజాగా జరిగిన సంఘటనను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.


మొరాయించిన ఆర్టీసీ సిటీ బస్సుతో నిలిచిన ట్రాఫిక్

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్.. రిమాండ్

వనస్థలిపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఎడునూరి అనిల్ కుమార్(37) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి సరూర్‌నగర్‌లోని పోస్టాఫీసు సమీపంలో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ సెక్యూరిటిగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న అనిల్‌కుమార్ ఈనెల 7న వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఓ టైలర్ షాప్ తాళం పగులగొట్టి సుమారు రూ.5లక్షలు విలువచేసే విలువైన చీరలు, ఇతర వస్తువులను దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు నిందితుని వద్ద ఉన్న యాక్టివ బైక్, జాక్‌మిషన్, ఒక కంప్యూటర్, రేడియం ప్లాటర్, కటింగ్‌మిషన్, వెల్డింగ్‌మిషన్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరిత గతిన ఛేదించిన పోలీసులను ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డిలు అభినందించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.


దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

విద్యుదాఘాతంతో గాయపడిన యువతి మృతి

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గాయపడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ కోరుట్లకు చెందిన చిలుముల అరుణ(23) హాస్టల్‌లో ఉంటూ ఎల్బీనగర్ ఫ్లై డెస్టినీ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుంది. శనివారం మధ్యాహ్నం సిబ్బంది ఆఫీస్ వద్ద గూగుల్ మ్యాప్ వారి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నారు. వాళ్లు ఆమెను సహాయం చేయమంటే ఫ్లెక్సీ ఫ్రేమ్ పట్టుకుంది, ఆ స్టీల్ ఫ్రేమ్ సమీపంలో గల కరెంట్ తీగలకు తగిలింది. విద్యుదాఘాతంతో ఆమె కింద పడిపోయింది. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డయింది. కార్యాలయం వారు చికిత్స నిమిత్తం ఆమెను కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి చిలుముల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యభర్తల గొడవ.. మనస్తాపంతో భార్య ఆత్మహత్య

వనస్థలిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భార్య భర్తల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రాజపేట పాపయ్య తండాకు చెందిన రాములు, జానమ్మ(40)లకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. తమ ఇద్దరు కొడుకులతో కలిసి మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటు, కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుండగా, కుమార్తె హాస్టల్లో ఉంటు విద్యను అభ్యసిస్తుంది. కాగా జానమ్మ భర్త రాములు కొంత కాలంగా పనికి వెళ్లకపోవడంతో ఇదే విషయంపై ఇరువురి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. భర్తతో పాటు కుమారులు కూడా పనులకు వెళ్లకపోవడంతో జానమ్మపైనే కుటుంబ భారం పడి పోషణకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో సోమవారం భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన జానమ్మ బాత్‌రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో యువకుడు..

చంపాపేట: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హఫీజ్‌బాబానగర్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. కంచన్‌బాగ్ హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఇస్మాయిల్ ఉస్సేన్(22) ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి హాల్‌లో నిద్రపోయినట్లు తెలిపారు. ఉదయం వారు లేచి చూడగా ఇస్మాయిల్ బెడ్‌రూమ్‌లో ఇనుపరాడ్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇస్మాయిల్ మృతికి ఆర్థిక సమస్యలే కారణమని మృతుడి తండ్రి షేక్ జాఫర్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

కొత్తపేట: ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఆర్‌నగర్‌లో ఉండే ఎండీ అజీమ్(45) ఓ బేకరీలో పనిచేసేవాడు. మూడు నెలల క్రితం పని వదిలేసి ఇంట్లోనే ఉంటున్నాడు. అతడి భార్య ఫాతిమాసుల్తానా ఇరుగు పొరుగు ఇండ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. తరచూ ఇద్దరి మధ్య ఆర్థిక సమస్యలపై గొడవ జరిగేది. సోమవారం ఉదయం 9గంటలకు ఆమె పనికి వెళ్లిపోయింది. ఆమె మధ్యాహ్నం 12గంటకు తిరిగి వచ్చింది. అతడు బెడ్‌రూమ్ డోర్ తీయకపోవడంతో కిటికీలో నుండి చూసింది. అతడు ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. 100 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు, ఎల్బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బెడ్ రూమ్ తలుపులు విరగ్గొట్టి లోనికి వెళ్లి అజీం మృతదేహాన్ని కిందకు దించి చూశారు. ఫాతిమాసుల్తానా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అనారోగ్యంతో మహిళ..

కొత్తపేట : నాగోల్ పీఎస్ పరిధిలో అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ టీకే రెడ్డినగర్, వెంకటరమణ కాలనీలో రిషాంక్ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో ఉండే వెంకటనర్సింహ అశోక్‌కుమార్ సతీమణి బచ్చు భాగ్యలక్ష్మి గృహిణి. సంవత్సరాలుగా ఆమె పలు అనారోగ్య కారణాలతో సతమతమవుతోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి మృతురాలి సోదరుడు సిరిమల్లె వెంకటరమణ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.